విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

సోమవారం 04 ఆగస్టు 2025 8 పేజీలు

గ్రానైట్ బండల కింద నలిగిన బతుకులు

క్వారీలో ఘోర ప్రమాదం

ఆరుగురు వలస కార్మికుల మృతి

- ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- చనిపోయిన వారు ఒడిశా వాసులుగా గుర్తింపు
- నిబంధనలు పాటించకనే ప్రమాదం
- సహాయక చర్యలు చేపట్టిన పోలీసు యంత్రాంగం
- బల్లికురవ సమీపంలోని సత్యకృష్ణ గ్రానైట్ పరిశ్రమలో ఘటన
- విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలో సత్యకృష్ణ గ్రానైట్ పరిశ్రమలో వారంతా ఒడిశా నుంచి వచ్చిన వలసజీవులు. పొట్టకూటి కోసం కుటుంబ సభ్యులకు దూరంగా పరాయి రాష్ట్రం నుంచి వచ్చి, ఓ గ్రానైట్ క్వారీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మామూలుగా ఆదివారం ఆటవిడుపుగా సెలవు తీసుకుంటారు. కానీ, వారికి పనితోనే కాలక్షేపం అనుకుంటా ఆరోజు కూడా పనికి వెళ్లిన కార్మికులకు అదే చివరి రోజు అవుతుందని కలలో కూడా ఊహించి ఉండరు. క్వారీలోని బండరాళ్ల రూపంలో వలసజీవుల బతుకులను చిదిమేసింది. ఒకరు కాదు, ఇద్దరు అంతకన్నా కాదు. ఏకంగా ఆరుగురిని బలితీసుకోగా 8 మంది తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఇంతటి పెను విషాదకరమైన సంఘటన బాపట్ల జిల్లా బల్లికురవ మండలం పరిధిలోని ఓ క్వారీలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మృతులు ఒడిసా రాష్ట్రానికి చెందిన దండ బదత్య (48), టకున దలాయ్ (37), బనమల చెహ్ర (30), భాస్కర్ భిషోయ్ (40), సంతోష్ గౌడ్ (36), ముస్సాజన (43)గా అధికార

- మిగతా 2 లో

బల్లికురవ క్వారీ మృతులకు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ డిమాండ్ 2లో

కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం

- ప్రకాశం జిల్లా అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం
- అభివృద్ధికి కోసం సలహాలు, సూచనలు ఇవ్వండి
- టీడీపీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ

విశాలాంధ్ర -ఒంగోలు : ఐదు సంవత్సరాల వైసిపి విధ్వంసమైన పాలన చూసి ప్రజలు చెప్పుతో కొట్టినట్టు 11 సీట్లకే పరిమితం చేసినా ఇంకా బుద్ధి రాలేదా అని తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ వైకాపా నేతలపై ధ్వజమెత్తారు. 75 ఏళ్ల వయసులో ముఖ్యమంత్రి చంద్రబాఉబ ఎర్రటి ఎండలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించి పొలం గట్టున రైతులతో మాట్లాడితే వైకాపా జిల్లా అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డికి సినిమా సెట్టింగ్‌లా కనిపించిందా అంటూ మండిపడ్డారు. ఒంగోలులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైకాపా తీరుపై నూకసాని నిప్పులు చెరిగారు. ప్రతి రైతుకు మేలు చేసే విధంగా పంట పెట్టుబడి సాయం కింద 20వేలు ఇచ్చే విధంగా ఎన్నికలలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి దర్శి నియోజకవర్గం దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలోని రైతుల సమక్షంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులకు మేలు చేసే విధంగా 46లక్షల 85వేల 838 రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేయడం జరిగింది. కానీ జిల్లా వైసీపీ నాయకులు దానిని అభినందించాల్సింది పోయి సినిమా సిట్టింగ్ లా ఉందని అనడం చౌకుబారు రాజకీయాలకు నిదర్శనం అని అన్నారు.సూపర్-6 హామీలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ వస్తున్నారు. ఇకనైనా వైసీపీ నాయకులు విద్వేష రాజకీయాలను మానుకొని జిల్లా అభివృద్ధి కోసం సలహాలు సూచనలు తెలియజేసి పాటుపడాలని హితవు పలికారు.

పోరాటాలు చరిత్ర సీపీఐదే

- రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : వంద సంవత్సరాల పోరాటాల చరిత్ర సీపీఐదేనని, ప్రజల పక్షాన నిలబడి పోరాడే పార్టీ సీపీఐ అని, ఈ నెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర 28వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జమీందారీ జాగీర్ దారి సంస్థానాలకు వ్యతిరేకంగా మహత్తర పోరాటాలు సీపీఐ నిర్వహించిందని, ప్రజల సామాజిక రాజకీయ ఆర్థిక సమానత్వం కోసం అలుపెరగని పోరాటాలు నడిపిందన్నారు. బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, భూ సంస్కరణల అమలు ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు కోసం ప్రభుత్వాలపై విజయం సాధించింది అన్నారు. కార్మికుల రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన సీపీఐ రాష్ట్ర మహాసభలో ఆగస్టు 20 నుండి 25 వరకు ఒంగోలులో జరగనున్నాయి. ఈ మహాసభల జయప్రదానికి ప్రతి కార్యకర్త పూనుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెవివి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ పలు పోరాటాలు నిర్వహించిందన్నారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు సాధన కోసం సీపీఐ నిర్వహిస్తున్న పాత్ర ప్రజా ఆమోదం పొందింది అన్నారు. రామాయపట్నం ఓడరేవు నిమ్స్ దొనకొండ పారిశ్రామిక వాడల అభివృద్ధి కోసం గుండ్లకమ్మ పాలేరు ప్రాజెక్టుల కోసం కొత్తపట్నంలో పర్యాటక ప్రదేశంగా మార్చాలని, ప్రకాశం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర మహాసభలలో చర్చించి రాజీలేని పోరాటాలకు సిద్ధం కానున్నామని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవండ్ల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, మండల కార్యదర్శ మన్నే సాంబశివరావు, దాసరి మల్లికార్జున, జి.గురునాధం, నక్కా తిరుపతయ్య, పూర్ణకంటి తిరుమలయ్య పాల్గొన్నారు.

శనగకు గిరాకి 2లో

చంద్రబాబువి అబద్దపు వాగ్దానాలు : ఎమ్మెల్యే చంద్రశేఖర్ 3లో

అప్పిఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : ఏఐటీయూసీ 4లో

శనగకు గిరాకి

స్థానిక మార్కెట్‌లో ఎర్రశనగ-11కు డిమాండ్

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు: శనగల మార్కెట్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. జేజీ-11 (ఎర్రశనగలు)కు మార్కెట్‌లోస్వల్ప గిరాకీ వచ్చింది. నిన్నమొన్నటి వరకు రూ.5,500 వరకు ఉన్న ధర ప్రస్తుతం రూ. 6,400 వరకు చేరింది. మరికొంత పెరిగి రూ.7,000 వేల వరకు చేరవచ్చని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒక కాక్-2 వెరైటీ (తెల్లశనగలు) మార్కెట్లో పెద్దగా కదలిక లేదు. ప్రస్తుతం రూ.6,300 వరకు మాత్రమే ఉంది. వాస్తవంగా జేజీ-11 కన్నా కాక్-2 ధర అధికంగా ఉంటుంది. ఈ ఏడాది అనూహ్యంగా జేజీ-11 ధర మెరుగ్గా ఉండడం గమనార్హం.

పంట ఉత్పత్తి తగ్గడమే :

రబీలో సాగు చేసే ఈ పైరు ప్రధానంగా ప్రకాశం, గుంటూరు, కర్నూలులో జిల్లాల్లో మాత్రమే పండుతోంది. అయితే గత మూడేళ్లగా శనగ సాగు నష్టాన్ని మిగిల్చడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపారు. ఈ ఏడాది మరీ ముఖ్యంగా బర్లీ పొగాకు సాగు శనగ సాగును తగ్గించింది. దీంతో స్థానిక మార్కెట్లో జేజీ-11 శనగలు తక్కువగా ఉన్నాయి. ఇక మరోవైపు దిగుమతులు కూడా పెద్దగా రాలేదు. ఇక్కడి శనగల మార్కెట్‌ను ప్రధానంగా దిగుమతులు ప్రభావితం చేస్తాయి. ఆస్ట్రేలియా, టాంజినియా నుంచి దిగుమతులు ఉంటే ఒక్కడ ధర తగ్గుతుందని వ్యా పారులు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం దిగుమతులు కూడా లేకపోవడంతో ధర పెరిగిందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం స్థానికంగా ఉన్న జేజీ-11 ఎర్రశనగలు స్థానికంగా పప్పుమిల్లులకు అధికంగా వెలుతున్నాయి. తమిళనాడు ప్రాంతంలోని పప్పు మిల్లులకు కూడా అడపాదడపా లారీలు వెళుతున్నాయి. మార్కెట్లో ఎర్రశనగలు తక్కువగా ఉండడం, కొత్త సీజన్లో సరుకు రావ డానికి సమయం ఉండడంతో ధర మరికొంత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. సుధీర్ఘ విరామం తర్వాత శనగ ధరలు పెరగడంతో రైతులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రబీలో పెరగనున్న సాగు :

ఈ ఏడాది రబీలో శనగ సాగు పెరిగే అవకాశం ఉంది. ఓ వైపు మిర్చి, పొగాకు గతేడాది రైతులకు తీవ్ర నష్టాలను మిగిల్చాయి. నేటికీ రైతుల ఇళ్ల వద్ద ఉన్న పొగాకు, అమ్ముడు పోలేదు. మిరప కూడా కోల్డ్ స్టోరేజ్లోనే ఉంది. ఇక అపరాల పంటలైన మినుము, పెసరకు కూడా గిట్టుబాటు ధర లేదు. దీంతో శనగ సాగువైపే రైతులు మొగ్గు చూపే అవకాశం ఉంది.

వివాహ వేడుకల్లో 'బూచేపల్లి'

విశాలాంధ్ర -తాళ్లూరు: మండలంలోని తురక పాలెం గ్రామానికి చెందిన కుమ్మిత చిన అంజి రెడ్డి కుమార్తె వెంకట మౌనిక వివాహానికి వైసీపి జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి హాజరై నూతన వధువుకు దీవేనలు అందించారు. ఆయన వెంట పార్టీ అధ్యక్షుడు టీవీ సుబ్బా రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూధనర రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్‌లు నాగి రెడ్డి, జయ రామి రెడ్డి , తాళ్లూరు మండల ఇన్‌చార్జి మస్తాన్ రెడ్డి, బచ్చు సుబ్బా రెడ్డిలు ఉన్నారు.

కార్మిక చట్టాలను పరిరక్షించాలి

క్వారీలో జరిగిన ప్రమాద స్థలి పరిశీలించిన సీపీఐ ఏఐటీయూసీ నాయకులు

విశాలాంధ్ర - బల్లికురవ : కార్మిక చట్టాలను పరిరక్షించాలని సీపీఐ ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బల్లికురవ గ్రానేట్ క్వారీలో జరిగిన ప్రమాద స్థలాన్ని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా అద్దంకి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి తుమ్మల పూర్ణచంద్రరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు కెఎల్‌డి ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ మండలంలో సత్య కృష్ణ గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందటం బాధాకరం అన్నారు. మైనింగ్ అధికారులు కార్మిక శాఖ అధికారులు క్వారీలో పనిచేసే కార్మికులకు లేబర్ కార్డులు ఇప్పించాలన్నారు. ఇలాంటి ప్రమా దాలు జరిగినప్పుడు వాళ్ల కుటుంబలకు యాజమాన్యం ఆర్థిక సహాయం చేయడానికి కార్మికులకు వెలుసుబాటు ఉంటుందన్నారు. క్వారీ నిబంధన ప్రకారం 15 మీటర్ల నుంచి 20 మీటర్ల లోపు క్వారీలో ఎత్తు ఉండాలని దాదాపు 40 మీటర్లు ఎక్కువ ఉంటుందని క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా నడుచు కుంటున్నాడన్నారు. వారానికి ఒకరోజు సెలవు దినం ప్రకటించాలని కార్మికులకు విశ్రాంతి రూములు కల్పించాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. బల్లికురవ ఏఐటీయూసీ అధ్యక్షులు నిమ్మల అప్పారావు, సంతమాగులూరు ఏఐటీయూసీ అధ్యక్షులు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

నలిగిన బతుకులు

(మొదటిపేజీ తరువాయి)

యంత్రాంగం ధృవీకరించారు.

- సేకరించిన వివరాల మేరకు బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలో సత్య కృష్ణ గ్రానైట్ క్వారీలో ఆదివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం జరిగింది. క్వారీ అంచు విరిగిపడి అందులో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన కార్మికులు నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు చనిపోయారు. ప్రమాదం జరిగిన సమయంలో 16 మందికి పైగా గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్నట్లు సమాచారం. వీరంతా ఆదివారం ఉదయం పనిలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. బండరాళ్లను పగులగొట్టే పనిలో ఉన్నారు. ఇంతలో ఓ పెద్దరాయి ప్రమాదవశాత్తూ జారిపడగా ఆరుగురు మృత్యువాత చెందగా మరికొందరు తీవ్రంగా గాయపడగా వారిని ఒంగోలు, అద్దంకి ఆస్పత్రికి తరలించారు. ఇంకా రాళ్ల కింద పడిన వారిని వెలికి తీసే పనిలో పోలీసు యంత్రాంగం నిమగ్నమయ్యారు. మృతుల వివరాలతో పాటు ప్రమాదానికి గల కారణాలు పూర్తి స్థాయిలో తెలియాల్సి ఉంది. ప్రమాద స్థలాన్ని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

- నిబంధనలకు తిలోదకాలు..

గ్రానైట్ పరిశ్రమలలో నిబంధనలు పాటించకనే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అందులో పనిచేసే కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదం ఉందని తెలిసినా కూడా కార్మికులతో పని చేయించడం ఏమిటి అని సర్వత్రా నుంచి ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. వలసజీవుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘోర ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, పాలకులకు పట్టదాని ప్రశ్నిస్తున్నారు. ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం అందించి, వారిని ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బల్లికురవ క్వారీ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళికి సీఎం ఫోన్ చేసి ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు.

గంగా భవానికీ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర -తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన తాళ్లూరు మండలం సోమవరప్పాడు పరధిలోని గుంటి గంగా భవాని అమ్మవారికి అదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురిపించి చల్లగా చూడు గంగమ్మా అంటూ పూజలు ప్రత్యేక పూజలు చేసారు. పూజారులు ప్రకాశ రావు, కామేశ్వర శర్మ, బాల రాజు, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురు బ్రహ్మం, ఈఓ వాసు బాబు, ఆర్‌ఏ ప్రసాదు భక్తులను కావలసిన సౌకర్యాలను పర్యవేక్షించారు.

కదిరి పార్థసారథికి వివాహ ఆహ్వానం

విశాలాంధ్ర-సిఎస్ పురం : ఈ నెల 14వ తేదీన జరిగే తమ కుమారుడు నితిన్ రెడ్డి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన శ్రీ నారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి ఆదివారం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్ధసారదిని శీలంవారిపల్లి లో కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

బల్లికురవ క్వారీ మృతులకు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ డిమాండ్

విశాలాంధ్ర - బాపట్ల : బల్లికురవ గ్రానైట్ క్వారీలో చనిపోయిన మృతులకు నష్టపరిహారం రూ. 50 లక్షలు వెంటనే ఇవ్వాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ డిమాండ్ చేశారు. ఆదివారం బల్లికురవ క్వారీలో జరిగిన ప్రమాదం ఆరుగురు మృతి చెందడం పట్ల సింగరకొండ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలు పాటించని బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. బల్లికురవలో ఉన్న సత్య కృష్ణ గ్రానైట్ క్వారీలో రాళ్లు విరిగి పడడం వల్ల 6 కార్మికులు మృతి చెందడం బాధాకరమన్నారు. మరో 10 మంది కార్మికులు క్షతగాత్రులు అయ్యారని ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తుంది. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, తీవ్ర గాయాలైన క్షతగాత్రులకు రూ.20 లక్షలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ క్వారీ గనుల్లో భద్రతా ప్రమాణాలు సరిగ్గా పాటించనందు వల్లే ఈ విధమైన ప్రమాదాలు జరిగి పెద్ద సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్న సందర్భాల్లో అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేయడమే గాక రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించాలని కోరారు. భద్రత ప్రమాణాలు సరిగ్గా పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మృతులు, క్షతగాత్రులంతా ఒరిస్సా నుంచి వచ్చిన కార్మికులు అని వలస కార్మికులగా చూడొద్దు అన్నారు.వాళ్ళు ఎదురు తిరిగి ప్రశ్నించరనే చిన్న చూపుతో యజమానులు భద్రత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, క్వారీ యజమానులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పనులు జరుగుతున్న బల్లికురవ ,సంతమాగులూరు ,గురిజేపల్లి లాంటి గ్రామాల్లో ఉన్న క్వారీలను సందర్శించి భద్రత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరకొండ డిమాండ్ చేశారు.

చంద్రబాబువి అబద్ధపు వాగ్దానాలు

ఎర్రగొండపాలెం
ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఎన్నికల వాగ్దానాలు ఇచ్చిన అన్ని పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేసే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన దోర్నాల్లో బాబు సూరటి మోసం గ్యారంటీ, అనే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విచ్చేసిన ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు ముందుగా వైసిపి నాయకులు దోర్నాల మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక వైఎస్ విగ్రహానికి పూల మాలాలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అనంతరం సభా ప్రాంగణానికి ర్యాలీగా బయలుదేరి శ్రీశైలం రోడ్‌లో గల బాబు సూరటి మోసం గ్యారంటీ అనే సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అబద్ధపు మాయమాటలతో అధికారాన్ని చేజిక్కించుకొని మోసపూరిత మాటలు ప్రజలకు చెబుతున్నాడని తెలిపారు. అనేక అబద్దాలు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి నేడు,ఖజానా ఖాళీ ఉంది ఏం చేయాలో తెలియదే అంటూ కల్లబల్లి కబుర్లు చెబుతూ అబ్బ కొడుకులు రాష్ట్రాన్ని దోచేస్తున్నారని అన్నారు. ప్రజలు ఈ మోసాల నుండి గట్టెక్కాలంటే వైయస్సార్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే ప్రజల యొక్క స్థితిగతుల్లో మార్పు వస్తుందని ప్రజల యొక్క హృదయాలను తెలిసిన నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భర్త గుమ్మ పద్మజ యల్లేష్, షేక్ అబ్దుల్ మజీద్, వెంకటేశ్వర్ రెడ్డి, కిక్కురీ నారాయణరెడ్డి, పొందుగల వెంకటేశ్వర్ రెడ్డి, జంకె సుబ్బారెడ్డి, షేక్షావలి,దూదేకుల కాసింపిరా, గోలమరు రాజశేఖర్ రెడ్డి, బొగ్గరపు రమేష్, అల్లు రాంభూపాల్ రెడ్డి మరియు వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'లో ఎమ్మెల్యే ఉగ్ర

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసే కార్యక్రమంలో శనివారం కనిగిరిలోని ఏఎంసిలో రైతులతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దర్శిలో శనివారం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా కనిగిరిలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి రైతులతో కలిసి కనిగిరి నియోజకవర్గంలోని రైతులకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ విధులను కనిగిరిలోని ఏఎంసీలో రైతులతో కలిసి విడుదల చేశారు. ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 42వేల 302 మంది రైతులకు మొదటి విడతగా రూ.28.74 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమా కానున్నాయని తెలిపారు. కనిగిరి మండలంలో 10,441, హనుమంతునిపాడు మండలంలో 6,542, పామూరు మండలంలో 7,621, పిసి పల్లి మండలంలో 6,665, వెలిగండ్ల మండలంలో 5,736, సిఎస్ పురం మండలంలో 5,537, మంది రైతులకు లబ్ధి చేకూరానుందన్నారు. గత ప్రభుత్వంలో 13,500 రైతులకు అందించేవారని కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరానికి 20వేలు అందిస్తామని సూపర్ సిక్స్ లో పొందుపరిచిన విధంగానే మొదట విడతగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎన్డీఏ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జంగిల్స్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని మంగమూరు సమీపంలో గల కొప్పోలు మేజర్ వద్ద ఆదివారం 10 లక్షలు 25వేల రూపాయలు వ్యయం కాగల జంగిల్ క్లియరెన్స్ పూడికతీత పనులను జిల్లా ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ డి.వరలక్ష్మి ప్రారంభించారు. ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని జంగిల్ క్లియరెన్స్ పూడిక తీత పనులకు 42 లక్షల పదిహేను వేల రూపాయలను కేటాయించారు. జిల్లాకు 9 కోట్ల 63 లక్షల రూపాయలనుకేటాయించారు. అద్దంకి చీమకుర్తి దర్శి డివిజన్ పరిధిలో సాగర్ కాలువలలో జంగిల్ క్లియరెన్స్ పూడికతీత పనులకు ప్రభుత్వం ఈ నిధులను కేటాయించినట్టు ఈ కార్యక్రమాన్ని ఒంగోల్ ఓ అండ్ యం సబ్ డివిజన్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు నల్లూరి కృష్ణారావు పర్యవేక్షించారు. ఒంగోలు ఓ అండ్ ఎం సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాపమ్మ జెఇ కే.ప్రియదర్శిని సబ్ డివిజన్ జెఈలు అనూష, సుస్మిత, వర్క్ ఇన్స్పెక్టర్ సుబ్బారెడ్డి మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు డిస్ట్రిబ్యూటరీ కమిటీ సంఘం అధ్యక్షులు రామా శ్రీనివాసరావు సొసైటీ అధ్యక్షులు నల్లూరి నారాయణరావు మండల టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు నీటి సంఘం అధ్యక్షులు ఏ శీను వైస్ ప్రెసిడెంట్ కందుకూరు సుబ్బారావు మంగమూరు యూనిట్ ఇంచార్జ్ నల్లూరి యుగంధర్ జనసేన పార్టీ నాయకులు కందుకూరి వాసు పేర్ణమిట్ట సిపిఎం నాయకులు అన్ను సుబ్బారావు టిడిపి నాయకులు మొలకలపల్లి శ్రీనివాసరావు నాదెళ్ల ఆంజనేయులు ఓ అండ్ ఎం ఒంగోలు సబ్ డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలువురికి బూచేపల్లి పరామర్శ

విశాలాంధ్ర - తాళ్లూరు: తూర్పుగంగవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు వైసీపి జిల్లా అధ్యక్షుడు , దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. మాజీ పార్టీ ప్రధాన కార్యదర్శి యాడిక యలమందా రెడ్డి ఇటీవల బైక్ ప్రమాదానికి గురై చెయ్యికట్టుకట్టించుకుని నివాసం వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రమాదం జరిగిన తీరును వివరాలను డాక్టర్ బూచేపల్లి అడిగి తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా భీమిని సుబ్బా రావు, గోల్డ్ వెంకటేశ్వర రెడ్డి అమ్మ అంకమ్మ, నగళ్ల పాపయ్యను పరామర్శించారు. అనంతరం తాళ్లూరు మాజీ ఎంపీపీ కోట రామి రెడ్డి, వైసీపి నాయకుడు కోట క్రిష్టా రెడ్డి తల్లి హనుమమ్మ సంస్మరణ దినోత్సవంను హాజరై నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాలలో పార్టీ అధ్యక్షుడు టీవీ సుబ్బా రెడ్డి, పార్టీ సంయుక్త కార్యదర్శి పోశం మధుసూధన రెడ్డి, మాజీ ఎంపీపీ గోళ్లపాటి మోషే , మాజీ ఎఎంసీ డైరెక్టర్ గుజ్జులయోగి రెడ్డి, మాజీ దేవస్థాన కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాస రావు, దేవదానం, లాయర్ మల్లీశ్వర రెడ్డి, యత్తపు మధుసూధన రెడ్డి, కొండా రెడ్డి, గోపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-పొన్నలూరు : మండల కేంద్రమైన పొన్నలూరులో ఆదివారం తల్లిపాలు వారోత్సవాలు భాగంగా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు మధురవాణి, గౌస్య గృహ సందర్శన చేశారు. వారు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు సంజీవనిల పనిచేస్తాయని. కేవలం చిన్నారి ఎదుగుదలకే కాకుండా రోగనిరోధక శక్తి పెంపొందేందుకు అవి ఎంతో దోహదపడతాయి. ప్రస్తుత రోజుల్లో కొందరు తల్లిపాలు ఇచ్చేందుకు తిలోదకాలిస్తున్నారు. ఈ ధోరణితో కలిగే దుష్ప్రభావాలు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను పసిగట్టలేకపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిడ్డల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

రత్నమ్మకు వైసీపీ నేతల నివాళి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని మైనంపాడు గ్రామం చెందిన వైసీపీ నాయకులు పెరుగు సుబ్బారావు తన నివాసం వద్ద తల్లి రత్నమ్మకు సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వైసీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పాల్గొని రత్నమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు మాదాల వెంకట్రావు, వైసీపీ నాయకులు మాచవరం వెంకట్రావు, పెరుగు సుబ్బారావు, పెరుగు కృష్ణ బస్సు మస్తాన్ నల్లగట్ల రామాంజనేయులు వై.గణేష్ కె.మహేష్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ అధ్యక్షుడిగా తోట శ్రీనివాసులు

విశాలాంధ్ర-సిఎస్ పురం : ఏపీటీయఫ్ సి ఎస్ పురం మండల శాఖ ఎన్నికలు సి యస్ పురం లోని వడ్డెపాలెం స్కూల్లో ఆదివారం ఏకగ్రీవంగా జరిగి నూతన కమిటీ ని ఎన్నుకొన్నట్లు ఎన్నికల అధికారి రాష్ట్ర కౌన్సిలర్ పి రాజ్ కుమార్ తెలిపారు. నూతన అధ్యక్షులు గా తోట శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు గా టీ లక్ష్మీ నారాయణ, ఏ సాయి కుమార్, డి పున్నమ్మ, ప్రధాన కార్యదర్శిగా జె యస్ ఆనంద్ బాబు, కార్యదర్శులు గా బి శ్రీనివాసులు, బత్తుల రవీంద్ర, గండి సురేష్, షేక్ రెహానా, జిల్లా కౌన్సిలర్స్ గా చౌడం చంద్ర శేఖర్, కె చెన్నయ్య, జి పుల్లయ్య, జి రామక్రిష్ణ, సి హెచ్ సునీతా దేవి, బి చిన్న నారాయణ, ఇండ్ల ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు గా యస్ వహీద్, యం మధుబాబు, జి రవీంద్ర బాబు, పి అరుణ, ఈ చాంద్ బాషా , కార్యవర్గ సభ్యులు గా ముప్పాళ్ళ ప్రసాద్, ఆర్ సుబ్బయ్య, పెంచల నరసయ్య, యన్ వి నారాయణ, టీ రమేష్, సయ్యద్ సల్మా, యం నాగమణి, యం షరీఫ్ అహమ్మద్, విష్ణు, యన్ గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. ఈ రోజు వడ్డెపాలెం స్కూల్లో ఏపీటీఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి డి శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉద్యమం తప్ప వేరే మార్గం ఏమి లేదని రాబోయే రోజుల్లో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, పిఆర్‌సి కమిటీ నియామకం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఎస్‌పురం యంఈఓ జె ప్రసాద రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీసు కోసం ఏపీటియప్ చేస్తున్న కృషి అభినందనీయం అని తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న సి యస్ పురం యంఈఓ 2 రాజాల కొండారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కోసం ఏపీటియప్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సర్వీస్ ఇవ్వడం గొప్ప విషయం అని తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు యస్ యం షరీఫ్, ఒంగోలు వెంకటేశ్వర్లు, షేక్ ఖాదరున్నిస బేగం, కేశినేని వెంకటేశ్వర్లు, మండల ఏపీటీయప్ నాయకులు, మండలంలోని ఉపాధ్యాయులు విరివిగా పాల్గొన్నారు.

అప్పిఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం

విశాలాంధ్ర-కంభం : అప్పిఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో అప్పిఆటో కార్మికుల నూతన కార్యవర్గ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్మికులు క్రమశిక్షణతో ఉండాలని, వర్తమాన రాజకేయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిని 2023 నూతన మోటార్ చట్టాన్నీ రద్దు చేయాలని కోరారు. అదేవిధముగా రాష్ట్రప్రభుత్వం ఆటో కార్మికులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జరిమానాలు పెంచే జీవో నెంబర్ 21,31 ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు గుర్తింపుకార్డులు, ఇంటిస్థలాలు, ప్రభుత్వం విధించే టాక్సులు రద్దుచేయాలని తీర్మానం చేసారు.

అప్పిఆటో ఏకగ్రీవ నూతన కమిటీ ఎన్నిక :

గౌరవ అధక్షులుగా ఎండి ఇబ్రహీం, అధక్షులు జలపాటి రవికుమార్,

ఉపాధక్షులు దాసరి రూబెన్, కార్యదర్శి నల్లబోతుల సుబ్బయ్య, సహాయ కార్యదర్శిగా శేషయ్య నాయుడు, ట్రెజరర్ బషీర్, సభ్యులు ఓబులయ్య, నీలకంఠం, పూసల సాయి, అల్లూరయ్య, మండల సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్లు అధ్యక్షులు జలపాటి రవికుమార్ తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-టంగుటూరు : గ్రంధాలయాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రంధ పాలకులు గుమ్మడి వర్ధనరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. వర్ధనరాజు మాట్లాడుతూ అనేక మంది మేథావులు, శాస్త్రవేత్తలు ఇలాంటి గ్రంధాలయాలను ఉపయో

గించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించడం జరిగిందని అదే విధంగా ప్రతి విద్యార్థి ఇలాంటి గ్రంధాలయాలను సద్వినియోగం చేసు కునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నచ్చిన, మెచ్చిన పుస్తకాలను తీసుకొని చదవడం జరిగింది. చదవడం నాకిష్టం కార్యక్రమం ప్రతి ఆదివారం నిర్వహించడం జరుగుతుందని కావున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంధ పాలకులు గుమ్మడివర్ధనరాజు తెలిపారు.

అన్నదాత సుఖీభవ నిధులు జమ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండలంలోని 9061 రైతుల బ్యాంకు ఖాతాలో 634 లక్షలు 27,000 నిధులు జమ జమ చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి కే.ప్రకాష్ రావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 5000 పిఎం కిసాన్ పథకం కింద 2000 వేల రూపాయలు మొత్తం రూ. 7000లు జమ చేయడం జరిగిందన్నారు. ఎవరికైనా అన్నదాత సుఖీభవ డబ్బులు జమ కాకపోతే వారి పరిధిలోని రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుని సంప్రదించి తగిన డాక్యుమెంట్లు అందజేయాలని వ్యవసాయ అధికారి కోరారు.

సీతాలమ్మ బొడ్డురాయికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పూడిమెట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీతాలమ్మ బొడ్డు రాయికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో నెలరోజుల క్రితం గ్రామస్తులు ఐక్యంగా గ్రామ నడిబొడ్డున సీతాలమ్మ బొడ్డు రాయి నెలకొల్పారు. బొడ్డు రాయి ప్రతిష్టించి నెలపొంగల సందర్భంగా గ్రామంలోని మహిళలందరూ పొంగళ్ళు పొంగించి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో తెల్ల వారుజాము నుండి మహిళలు వేపాకులు చేత పట్టుకొని బొడ్డు రాయికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.

20వ వార్డులో పెన్షన్ పంపిణీలో ఫిరోజ్

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరి టౌన్ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ కనిగిరిలోని 20 వార్డ్‌లో శుక్రవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరిగి అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ అంజి నాయుడు, బూతు కన్వీనర్ పుల్లారావు, కుటుంబ సాధికార సమితి సభ్యులు రాము, ఖాజా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాలేటి గంగమ్మకి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని పెద అలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళాపురం గ్రామం సమీపంలో పాలేటి ఒడ్డున వెలిసిన ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భగీరథ పాలేటి గంగాభవాని అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. భక్తులు వేకువజామునే అమ్మవారికి పాల పొంగళ్ళు పెట్టుకుని నైవేద్యం సమర్పించారు. నూతన వాహనములు కొనుగోలు చేసినవారు అమ్మవారి సన్నిధిలో వాహనములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

'అన్నదాత సుఖీభవ' అమల్లోనూ మోసమే

- **వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్**
- **పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రూ.20 వేలు ఇస్తామని మాట తప్పారు..**
- **రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల మంది రైతులకు మొండిచెయ్యి**
- **గత ఏడాది ఇవ్వాల్సిన రూ.10,716 కోట్లు ఎగవేత**

విశాలాంధ్ర - కనిగిరి :

'సుఖీభవకు కోత.. అన్నదాతకు వాత' అనే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు అన్నదాతలను మోసం చేసారని కనిగిరి వైయస్సార్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వైయస్సార్ సీపీ హయాంలో 53.58 లక్షల మందికి లబ్ధి చేకూర్చగా ఇప్పుడూ చంద్రబాబు ప్రభుత్వం 46.86 లక్షల మందికే వర్తింపజేసీ సుమారు రాష్ట్రంలో 7 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ సాయాన్ని కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాదిపాటు అన్నదాత సుఖీభవ ఇవ్వకుండా రూ.10,716 కోట్లు పూర్తిగా ఎగనామం పెట్టిందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రతి రైతుకూ వ్యవసాయ పెట్టుబడి సాయంగా కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కాకుండా రాష్ట్ర ఖజానా నుంచి రూ. 20 వేలు ఇస్తామంటూ హామీ ఇచ్చారని చెప్పారు. నేడు దానిని ఎందుకు రూ.14 వేలకు తగ్గించారో, మిగిలిన రూ. 6 వేలు ఎందుకు ఎగ్గొడుతున్నారో సీఎం చంద్రబాబు చెప్పాలన్నారు. గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగిన ప్రతి సందర్భంలోను కేవలం 30 రోజుల్లోనే పరిహారం చెల్లించామని గుర్తు చేశారు. రైతుల పక్షాన ఉచిత పంటల బీమా ప్రీమియాన్ని భరించమన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ పండించిన ఏ పంటకు కూడ సరైన గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-టంగుటూరు : ప్రతి ఆదివారం టంగుటూరు గ్రామంలోని అనాథలకు, వృద్ధులకు భోజనాలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం న్యూ లైఫ్ హోలీ మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అనాథలకు, వృద్ధులకు నిరుపేదలకు, యాచకులకు భోజనం ప్యాకెట్స్, వాటర్ బాటిళ్లను పంపిణీ చేయడం జరిగింది. ఎవరైనా దాతలు ఉంటే ప్రతి ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని నిర్వాహకులు కోరారు.

ముందుకు కదలని మురుగు

దుర్వాసనతో అల్లాడుతున్న కాలనీ వాసులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పూరిమెట్ల గ్రామపంచాయతీలో సైడ్ కాలువలలో పేరుకు పోయి మురుగు ముందుకు కదలక పోవడంతో దుర్వాసనతో కాలనీ ప్రజలు అల్లాడుతున్నారు. ఇళ్లల్లోంచి వచ్చే మురుగునీరు ఇతర పదార్థాలతో పేరుకు పోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు కాలువలోకి చేరి ఎటు పోయే మార్గం లేక ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగిపోయాయి. దీంతో ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు

ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛంధ్రా, స్వర్ణాంధ్ర లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం ఊక దంపుడు ఉపన్యాసాలే తప్ప ఆచరలో శూన్యమని ప్రజలు అంటున్నారు. కొన్ని ప్రాంతాలలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండి దుర్వాసన వెదజల్లుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామ ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీరు లేకుండా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మండల అడక్ ఫోరం కమిటీ సభ్యులు పాఠశాలలను సందర్శించాలి

- ఎంఈఓ-2 నరసింహారావు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల అడక్ ఫోరం కమిటీ సభ్యులు పాఠశాలలను సందర్శించి అన్ని అంశాలను పరిశీలించాలని ఎంఈఓ-2 బరిగే నరసింహారావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ఎంఆర్సి కార్యాలయంలో మండల అడక్ కమిటీ ఫోరం సభ్యులకు సభ్యులకు సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా మాట్లాడారు. మండల అడక్ కమిటీ ఫోరం సభ్యులైన ఏడుగురు సబ్జెక్ట్ ఉపాధ్యాయులు నలుగురు ఎస్జిటి ఉపాధ్యాయులు వారానికి రెండుసార్లు అన్ని పాఠశాలలను సందర్శించి పాఠశాలలో జరిగే విద్య సంబంధమైన వివిధ ఉపాధ్యాయుని హ్యాండ్ బుక్, విద్యా శక్తి పథకం సబ్జెక్టుల నైపుణ్యాలను పరిశీలించాలని పరిశీలించిన అన్ని అంశాలను రికార్డులలో నమోదు చేయాలన్నారు. విద్యార్థుల మదింపు నోట్ బుక్స్, వర్క్ బుక్స్ విద్యాభివృద్ధికి తోడ్పడే విధంగా మండల అడక్ ఫోరం సభ్యులు తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో మండల అడక్ ఫోరం కమిటీ సభ్యులు గొట్లగట్టు కొనకనమిట్లల క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈ ఆదినారాయణ, బి.ఉదయ్ కుమార్, మండల అడగ్ కమిటీ టీం సభ్యులు బయాలజీ ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్ హిందీ, తెలుగు, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్ సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ఎం రామాంజనేయులు, గీత మురళి, బి.శ్రీని వాసులు, కే.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, తిరుపతయ్య, ఎస్‌జిటి ఉపాధ్యాయులు రమేష్ రెడ్డి, మురళి, సీఆర్పీలు చెన్నయ్య, శ్రీనివాసులు రెడ్డిలు పాల్గొన్నారు.

రుద్రభూమిలో సమస్యలు తాండవం!

- ఏల్చూరు హిందూ శ్మశానంలో ఆక్రమణల పర్వం
- ఉన్న కొద్దిపాటి భూమిని కమ్మేసిన పిచ్చిమొక్కలు
- ఖననానికి యాతన పడుతున్న గ్రామస్థులు
- పునాదులకే పరిమితమైన షెల్టర్ నిర్మాణం
- గ్రావెల్, చుట్టూ కంచె ఏర్పాటుకు వేడుకోలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మనిషి తన జీవన గమనంలో ఆటుపోట్లను ఎదుర్కొంటాడు. జీవితం చరమాంకంలో తనువు చాలించాక, అంతిమ సంస్కారాలైనా సక్రమంగా జరగాలని కోరుకుంటాడు. కానీ అలాంటి వారి చివరి ఆకాంక్షను నెరవేర్చలేని పరిస్థితులు నేటికీ గ్రామాల్లో ఉన్నాయంటే నమ్మశక్యం కాదేమో. అందుకు బాధ్యులు ఎవరై ఉంటారని అడిగితే.. గుమ్మడికాయ భుజాలు తడుముకున్న చందంగా అటు పాలకులు, ఇటు అధికారులు ఒకర్నొకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్న సంఘటనలు కోకొల్లలు. ఆ కోవలోకి వస్తుంది.

సంతమాగులూరు మండలం ఏల్చూరు హిందూ శ్మశాన వాటిక. చనిపోయిన వారి పార్థీవ దేహాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అశ్రునయనాల మధ్య చివరి మజిలీకి సాగనంపేందుకు వచ్చిన వారికి.. పిచ్చిమొక్కలు, తుమ్మచెట్లతో కమ్మేసిన 'రుద్రభూమి' దర్శనమిస్తోంది. పైగా ఉన్న కొద్దిపాటి స్థలంలోనే మృతదేహాలను పూడ్చాల్సిన దుస్థితి కూడా ఏర్పడింది. గ్రామంలో హిందువులు ఎవరైనా మృత్యుబారిన పడిన సందర్భంలో 'చచ్చినా.. చావేరా' అంటూ మనో వేదనకు గురవుతున్నారంటే సమస్య ఎంత జటిలంగా మారిందో చెప్పాల్సిన అవసరం లేదు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీలలో ఏల్చూరు ఒకటి. ఈ గ్రామంలో 15వేల పైచిలుకు జనాభా నివాసం ఉంటున్నారు. ఇందులో సింహభాగం పైగా హిందువులు ఉన్నారు. సాంప్రదాయం ప్రకారం.. వారిలో ఒకట్రెండు సామాజిక వర్గాలకు చెందిన వారు మాత్రమే హిందూ శ్మశాన వాటికలో కాల్చులు చేస్తుంటారు. ఎక్కువ మంది ప్రజలు (భూ స్థాపితం) ఖననం చేస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో మృతులను పూడ్చిన గుంతల్లోనే కొద్దిరోజుల తర్వాత మళ్లీ పూడ్చాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇక వర్షాకాలంలో అయితే ఆ ప్రాంతమంతా దుర్గంధంతో ముక్కుపుటాలు అదరాల్సిందేనని స్థానికులు చెబుతున్నారు.

- ఆక్రమణలు పరంపర...

ఏల్చూరు గ్రామంలో నామ్ హైవే రహదారి పక్కనే హిందూ శ్మశాన వాటిక ఉంది. ఒకప్పుడు సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. కంచె చేను మేసిందన్న చందంగా కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమణలకు తెగబడ్డారు. అక్కడే రేకుల షెడ్డులను నిర్మించి మృతదేహాల తరలింపు సమయంలో వారి బంధువులు వేచి ఉండేలా ఏర్పాటు చేశామని చిలకపలుకులు పలుకుతున్నారు. ప్రస్తుతం శ్మశాన స్థలం రెండు ఎకరాలకు పరిమితం అయింది. కొన్నేళ్ల క్రితం పిచ్చిమొక్కలు తొలగించినట్లు ప్రజలు చెబుతున్నారు. ఆ తర్వాత ఏళ్లతరబడి ముళ్లపొదలు, పిచ్చిచెట్లతో అలాగే ఉంది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా అధికారులు, పాలకులు మారుతున్నప్పటికీ శ్మశానం అభివృద్ధికి చర్యలు తీసుకోవడంలో శూన్యం అని చెప్పాలి.

- మరుభూమిలో ఖననానికి యాతన..

ఈఏడాది ఏల్చూరులో మరణాల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పాలి. గడిచిన నాలుగు నెలల వ్యవధిలో వయో భారంతో పాటు పలు ఆరోగ్య సమస్యలు, ప్రమాదాల బారిన పడి సుమారు 30 నుంచి 40 మంది వరకు చనిపోయారు. వీరిలో ఎక్కువ మంది హిందూ సామాజిక వర్గానికి చెందినవారే. రహదారి పక్కన ఉన్న శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేసే సమయంలో మృతుల తరఫున కుటుంబాలు, బంధువులు నరకయాతన అనుభవించినట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- పునాదులకే పరిమితమైన షెల్టర్ నిర్మాణం..

గ్రామానికి చెందిన ఓ దాత తన సొంత నిధులతో శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేసుకునేందుకు వీలుగా షెల్టర్ నిర్మాణం చేపట్టారు. పునాది వేసి, సిమెంట్ పిల్లర్లు సైతం నిలబెట్టారు. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ, షెల్టర్ నిర్మాణ పనులు నిలిపివేశారు. నాటి నుంచి ఇప్పటి వరకు అసంపూర్తిగానే దర్శనమిస్తోంది.

- కూటమి ప్రభుత్వం చొరవ చూపాలి..

ఏల్చూరు గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యల్లో హిందూ శ్మశాన వాటిక ఒకటి. గ్రామస్థుల అవసరాలను, పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని తక్షణమే మరుభూమిలో ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అలాగే శ్మశాన స్థలంలోని పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించడంతో పాటు గ్రావెల్ తోలకం చేపట్టాలని వేడుకుంటున్నారు. అదేవిధంగా షెల్టర్ నిర్మాణం, చుట్టూర కంచె సైతం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

5న స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ధర్నా

విశాలాంధ్ర - కనిగిరి : విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకు వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలు నిర్వహిస్తామని అందులో భాగంగా ఈనెల 5న కనిగిరిలోని ఆర్టీవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జిపి రామారావు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 9సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం ప్రజలపై మోపింద న్నారు. ఆనాడు చంద్రబాబు నాయుడు ఇక నుంచి ఈ బాధలు ఉండవని మేము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచమని పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ఎన్నికలలో హామీలు ఇచ్చి నేడు ఆ హామీని విస్మరించడం దారుణం అన్నారు. స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని లోకేష్ ఆనాడు పిలిపిచ్చారని నేడు అదే స్మార్ట్ మీటర్లను ఇంటింటికి బిగిస్తున్నారని లోకేష్ ప్రజలకు నమ్మకద్రోహం చేశారన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవడానికి పాలకులు పూను కుంటున్నారని ఆదాని కంపెనీ రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారులకు పాత మీటర్లు తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు అన్నారు. ఇది మీటర్ మార్పు మాత్రమే కాదు విధానం మార్పు అని విద్యుత్ పంపిణీ ప్రైవేటు కరణకు కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్రలో భాగమని పేర్కొన్నారు. ఈ మీటర్ ఖర్చు సింగల్ ఫేస్ కు 9వేలు త్రీ ఫేస్ కి రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారని 93 నెలల్లో వాయిదా పద్ధతి లో జనం నుంచి వసూలు చేస్తారని తెలిపారు. అదాని స్మార్ట్ మీటర్లు ఆపే వరకు పెట్టిన మీటర్లు తొలగించే వరకు ట్రూ ఆఫ్ చార్జీలు విధానాన్ని తొలగించే వరకు అదనపు భారాలను తగ్గించేవరకు ఈ దశల వారి పోరాటం చేస్తామన్నారు. అందులో భాగంగా ఈనెల 5న ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి గులాం, నియోజకవర్గ సహాయ కార్య దర్శి పి మోహన్, ఏఐటీయూసీ నాయకులు ఖాసీం పీరా, గుజ్జుల బాలిరెడ్డి, దాసరి సునీత, అంజమ్మ పాల్గొన్నారు.

వైద్యుడు రిచర్డ్ సన్ సాల్మన్‌కు నివాళులు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : పేదల వైద్యులు డాక్టర్ రిచర్డ్ సన్ సాల్మన్ శనివారం అంతిమ శ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి చీరాల నియోజక వర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీరాల ప్రాంతంలో తన తండ్రి సాల్మన్ బాటలో నడుస్తూ అనేక మంది పేద ప్రజలకు వైద్యం చేసి పేదల వైద్యుడిగా పేరు పొందారన్నారు. సాల్మన్ సెంటర్ గ్రామపంచాయతీ కార్యాలయానికి భవనాన్ని కూడా ఈ వైద్యులే దానంగా ఇచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎంపీటీసీ ఆకుపాటి

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మిరపల్లి, దుద్దెల, లక్కనబోయిన వారి వివాహ మహోత్సవ వేడుకల్లో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ ఆదివారం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నీరుకట్టు రసూల్, ఆవుల నారాయణ, ఇండ్ల నరసింహరావు,నక్క తిరుపతయ్య, సర్వేయర్లు సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండల కేంద్రమైన పామూరు ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త తాళ్లూరి రాజారావు ఇటీవల మృతి చెందారు . ఈ విషయం తెలుసుకున్న కనిగిరి నియోజకవర్గ టిడిపి వాణిజ్య విభాగ అధ్యక్షులు పందిటి హరీష్ తాళ్లూరు రాజారావు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాజారావు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉండి ఆదుకుంటుందని, తన వంతు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో చిన్న హజరత్, మోరబోయిన దొరబాబు, సోమిశెట్టి లక్ష్మీనారాయణ, సోమిశెట్టి శ్రీనివాసులు, గుబ్బ అఖిల్, పానుగంటి చలపతి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి

విశాలాంధ్ర - తర్లుపాడు : మండలంలోని కేతగుడిపి,సూరేపల్లి గ్రామాలలో ఆదివారం ఒంగోలు ఎన్ఫోర్స్మెంట్ డిటి డేవిడ్ రాజు,ఫుడ్ ఇనిస్పెక్టర్ ముకుంద హరిల ఆధ్వర్యంలో రేషన్ షాపులపై దాడులు చేసి,స్టాక్ ను పరిశీలించారు.రెండు చోట్ల ఎక్కువ మొత్తంలో బియ్యం ఉన్నట్లు గుర్తించారు.దీంతో ఇరువురు డీలర్లపై 6ఎ కేసులు నమోదు చేసినట్లు అధికారులు చెప్పారు.

కన్యకాపరమేశ్వరి, దుర్గాదేవికి సారె సమర్పణ

విశాలాంధ్ర-దుర్గి : మండల కేంద్రమైన దుర్గిలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి, దుర్గాదేవిలకు సారెను ఆర్య వైశ్య మహిళలు సమ ర్పించారు. శ్రావణమాసంను పుర స్కరించుకొని ఆదివారం ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణ ద్వారా మా జీవితాలలో వెలుగులు నింపాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆర్య వైశ్య మహిళలు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

విశాలాంధ్ర-సి ఎస్ పురం : మండలంలోని వి బైలు గ్రామంలో నాగిశెట్టి మధుబాబు శిరీషల వివాహ వివాహ కార్యక్రమానికి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు అలాగే కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కదిరి పార్థసారథి వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు మాజీ సర్పంచులు నాగిశెట్టి చినమాల కొండయ్య సారె వెంకట సుబ్బయ్య దొర తిరుపతయ్య మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

సామాజిక సేవల పెంపునకు మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర -ఒంగోలు : ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో కార్పోరేట్ సామాజిక బాధ్యత- సేవల పెంపుకు ప్రభుత్వ రంగ సంస్థల-కంపెనీల కార్యకలాపాలు- ప్రాజెక్టులు మరియు గత ఐదు సంవత్సరాల్లో కేటాయించిన నిధులు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. దీనికికేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువుల శాఖ సహాయక మంత్రి సురేష్ గోపి సమాధానమిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలు-కంపెనీలు లాభాలనే కాకుండా సామాజిక, పర్యావరణ, దాతృత్వ, నైతిక, ఆర్థిక రంగాలకు సంబంధించి సుస్థిరత సాధనకు కార్యకలాపాలు మరియు ప్రాజెక్టులు తప్పక నిర్వహించాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరియు ప్రకాశం జిల్లాలో పలు ప్రభుత్వ రంగ సంస్థలు ఆరోగ్యం, విద్యుత్, విద్య, ఇండ్లు, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, మహిళాభివృద్ధి, పర్యావరణ, వృద్ధులు, మత్స్యకార తదితర సంఘాలకు మరియు వికలాంగులకు సంబంధించి సుస్థిరతను సాధించుటకు పలు కార్యకలాపాలు మరియు ప్రాజెక్టులు చేపట్టునని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల పాలకమండళ్ళు వాటి నిర్వహణకు అధికారాలు కలిగివుంటాయని మరియు సదరు సంస్థలు స్వయంగా కాని లేక ఎంపిక చేయబడిన ఏజన్సీల ద్వారా గాని నిర్వహిస్తాయని తెలిపారు.ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్, భారత్ పెట్రోలియం కార్పోరేషన్, హిందుస్తాన్ పెట్రోలియం కార్పోరేషన్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, స్వచ్ భారత్ స్వచ్ విద్యాలయ అభియాన్ సంస్థ, ఇండో జర్మన్ ఇన్స్టిట్యూట్, ఏపి న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ అభివృద్ధి కార్పోరేషన్, ఏపిఎస్ స్కిల్ అభివృద్ధి కార్పోరేషన్, హిందుస్తాన్ ప్రిఫాబ్ లిమిటెడ్, ప్రభుత్వ పాఠశాలలు, సోలార్ పి వి ఎనర్జీ, ఏపి హౌసింగ్ కార్పోరేషన్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలు - కంపెనీలు అనేక కార్యకలాపాలు మరియు ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను మరియు ప్రకాశం జిల్లాలోను అమలుచేయుచున్నాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధికి వినతి

విశాలాంధ్ర-రెంటచింతల : రైల్వేస్టే షన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు వినతి పత్రం అందజేసినట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పల్లెర్ల కేశవరెడ్డి తెలిపారు. మాచర్ల-గుంటూరు ప్యాసింజరు రైలుకు బోగీలు తక్కువగా ఉన్నాయి. మాచర్లలోనే ప్రయాణికులు అధికంగా ఎక్కుతున్నారు. రెంటచింతల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి ప్రయాణీకులు సీట్లు లేకనే కిక్కిరిసిన బోగీలలో నిలబడాల్సిందే. బోగీలు, బాత్‌రూమ్‌లు కొరతతో మహిళలు, చిన్నారులు ఇక్కట్లు పడుతున్నారు. స్టేషన్ ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్లు లేవు. డ్యాం నిర్మాణ సమయాలలో నాగార్జునసాగర్ వరకు రైలు సౌకర్యం ఉంది. త్వరలో పునరుద్ధరించాలని వినతిలో పేర్కొన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. వారితో పాటు నారాయణపురం శ్రీనివాసరావు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

మహిళా మండలి అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ

విశాలాంధ్ర-పామూరు : మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు పలు పథకాలను ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని మహిళా మండలి అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ అన్నారు. మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో డ్వాక్రా గ్రూపు సభ్యులకు కూరగాయల విత్తనాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొట్టమొదట డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. సేంద్రియ ఎరువుల ద్వారా కూరగాయలను పండించి గ్రామాలలో మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు విత్తనా లను ఉచితంగా ప్రభుత్వం అందజేస్తున్న దన్నారు. ఈ అవకాశాన్ని డ్వాక్రా మహిళా సంఘాలు సద్వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మోసగాడు అని మాట్లాడిన కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు నిజమైన మోసగాడని అన్నారు. ఒకసారి ఎంపీపీగా ఓడిపోయిన బాబురావుకు రెండుసార్లు దర్శి, రెండుసార్లు కనిగిరి ఎమ్మెల్యేగా పోటీ చేయుటకు అవకాశం కల్పించి, మరోసారి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఇచ్చి గౌరవించిన చంద్రబాబు నాయుడును మోసం చేసిన ఘన చరిత్ర కదిరి బాబురావుకు ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు కొండ మల్లేశ్వరి, మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు గోళ్ళ రమణయ్య, గోళ్ళ వీరబాబు ఏలూరు నరసింహారావు, కొండా మనోజ్ కుమార్, నల్లపోతుల జయమ్మ, అడుసుమల్లి జయమ్మ, ఏలూరు భాగ్యలక్ష్మి, దూతుపల్లి భూదేవి, తానికొండ వరలక్ష్మి, గోళ్ళ రమ, వడ్లమూడి భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల గొంతు అణిచేందుకు కుట్ర

పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్

విశాలాంధ్ర- ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ కన్నుసన్నల్లో పాఠశాల విద్యా మండలి ఆగస్టు ఒకటవ తేదీన జారీ చేసిన విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలు,రాజకీయ పార్టీలను,ఇతర వ్యక్తులను పాఠశాలల్లోకి రానివ్వకుండా జారీ చేసిన జీవోని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ)రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థి సంఘాలు కొన్ని దశాబ్దాలుగా విద్యార్థుల హక్కుల కోసం, ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణ కోసం అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించింది అన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో అనేక పాలక పార్టీలు అధికారం కోసం పలు కుయుక్తులు పడుతుందన్నారు. అధికారంలో ఏ పార్టీలు ఉన్న.. నిస్వార్థంగా విద్యార్థుల హక్కులకోసం నిలబడేది విద్యార్థి సంఘాలు మాత్రమేనని తెలియజేశారు.గత ప్రభుత్వమైనా, నేడు అధికారం లో ఉన్న ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకు విధానాలకు లోబడి, మొత్తం ప్రాథమిక విద్యావ్యవస్థ నుంచి ఉన్నత విద్యా వ్యవస్థకు ధ్వంసం చేస్తూ ఉంటే విద్యార్థి సంఘాలు చూస్తూ ఊరుకోవని, అటువంటివారిని నియంత్రించాలని ఈ జీవోలని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు బలహీన పడటానికి పాలక పార్టీలు ఏ విధంగా దోహదపడ్డాయో బహిరంగ విచారణకు సిద్ధమన్నారు.. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు దమ్ముంటే విద్యార్థి సంఘాలతో చర్చలు జరపాలని, వారి అభిప్రాయాలని పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి దోహదపడాలని పిలుపు.. మరోవైపు రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలే దోపిడీ, విద్యార్థుల దగ్గర్నుంచి వారి రక్తాన్ని ఫీజుల రూపంలో తాగుతున్న, ఈ ప్రభుత్వానికి కనపడటం లేదా అని ప్రశ్నించారు? ఒక చైతన్య, నారాయణ విద్యాసంస్థలే పుస్తకాలు,యూనిఫారం, షూ, టై,బెల్టుల రూపంలో వేలాది కోట్ల రూపాయలు వసూలు చేస్తున్న ఈ ప్రభుత్వాలు కళ్ళకు గుడ్డకట్టుకున్నాయా ప్రశ్నించారు.. కనుక గత ప్రభుత్వం కూడా విద్యార్థి సంఘాలమీద అనేక రూపాలలో అక్రమ కేసులు బనాయించి జైళ్ల పాలు చేసిందన్నారు.. ఇప్పుడు అధికారానికి దూరమై ప్రతిపక్షంలో కూర్చున్నారని, ఈ కూటమి ప్రభుత్వం కూడా ఇటువంటి విధానాల్ని మానుకోకపోతే రాబోయే రోజుల్లో విద్యార్థులు,ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

గుర్రం జాషువా లా చాంబర్స్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - వినుకొండ : ఆదివారం వినుకొండలో న్యాయవాదులు అప్ప రాజు అపర్ణాదేవి, పరిశపోగు, రాహుల్ అంబేద్కర్, కాకాని నాగేశ్వరరావు గుర్రం జాషువా లా చాంబర్స్ అనే అడ్వకేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సీనియర్ న్యాయవాది డొక్కా మాణిక్యవరప్రసాద్ హాజరై న్యాయవాదుల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మహాకవి గుర్రం జాషువా పేరుతో అడ్వకేట్ ఆఫీస్ వినుకొండలో ప్రారంభించడం చాలా మంచి పరిణామం అని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మీసాల శ్రీనివాసరావు, పొట్లూరి సైదారావు, సిహెచ్ఎల్ ఎన్ మూర్తి, కావూరి గోపీనాథ్, చాగంటి వీరాంజనేయ చౌదరి, దుగ్గపోగువిజయ్, ధూపాటి విజయ్, ముప్పాళ్ళ జ్ఞానేశ్వర రావు, తదితర వినుకొండ బార్ న్యాయవాదులు హాజరయ్యారు. విశ్రాంత డిఐజి స్టాంప్స్ బాలస్వామి, జడ్జీ కో ఆప్షన్ మెంబర్ గుండాల స్వెనోం, సంద్రపాటి సైదా, మారుతీ వరప్రసాద్ మహిళా న్యాయవాది రెడ్డి నాగ పద్మ, మరియూ వినుకొండ పట్టణంలోని ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అడ్వకేట్ ఆఫీస్ ప్రారంభించిన న్యాయవాదులకు అభినందనలు తెలియజేసి చట్టపరంగా న్యాయపరంగా బాధితులకు అండగా నిలవాలని కోరారు.

భానుప్రసాద్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణ పోలీస్ స్టేషన్ లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న హోంగార్డ్ శ్రీనివాసరావు వైద్య ఖర్చుల నిమిత్తం లోక్ సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భాను ప్రసాద్ చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్ చేతుల మీదుగా రూ. 25వేల డిమాండ్ డ్రాఫ్టును అందించారు. పట్టణంలోని పండరీపురం లోనున్న హోంగార్డు శ్రీనివాసరావు స్వగృహంలో సీఐ రమేష్, అడ్వకేట్ మాదాసు భాను ప్రసాద్, విలేకరి నార్నే బాబ్జి రావు సందర్శించి ఆరోగ్యం గురించి తెలుసుకొని వైద్య ఖర్చులు నిమిత్తం డి.డి. ని అందజేశారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ సురేష్ మాట్లాడుతూ భాను ప్రసాద్ మిత్ర బృందం చేస్తున్న సేవలను అభినందించారు.

గతంలో రెండు పర్యాయాలు ప్రకృతి వైపరీత్యం వల్ల కేరళ రాష్ట్రంలో అపారమైన ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగినప్పుడు కూడా చిలకలూరిపేట నుంచి భాను ప్రసాద్ మిత్ర బృందం విరాళాలను అందించారని సీఐ గుర్తు చేశారు.

వాట్సాప్ గ్రూప్ ద్వారా ఇచ్చిన పిలుపునందుకొని తమ వంతు సహాయాన్ని అందిం చిన సభ్యులకు ఆయన అభినందించారు. ఇతరులు కష్టాలలో ఉన్నప్పుడు వారు ప్రదర్శించిన మానవత్వం నిజంగా స్ఫూర్తిదాయకం అన్నారు. వీరి దాతృత్వం హోంగార్డ్ శ్రీనివాసరావులో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి త్వరగా కోలుకునేలా చేస్తుందని ఆకాంక్షించారు.

నిబంధనలు పాటించని నిర్మాణాలను ఉపేక్షించం

నోటీసులిచ్చి కూల్చివేయండి
నగర కమిషనర్ ఆదేశం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార నిర్మాణాలను నోటీసులు ఇచ్చి కూల్చి వేయాలని, నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ లేకుండా, నిబంధనలు పాటించకుండా జరుగుతున్న నిర్మాణాలను ఉపేక్షించబోమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. స్థానిక అరండల్‌పేట, గుంటూరువారితోట ప్రాంతాల్లో అనధికార కట్టడాలు, బ్రాడీపేట, పట్టాభిపురం మెయిన్ రోడ్, జేకేసీ కాలేజి రోడ్ ప్రాంతాల్లో రోడ్, డ్రైన్ ఆక్రమణలపై తీసుకోవాల్సిన చర్యలపై పట్టణ ప్రణాళికాధికారులకు ఆదివారం తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జీఎంసీ నుంచి నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ తీసుకోకుండా లేదా ప్లాన్‌కి భిన్నంగా నిర్మాణాలు చేస్తే పట్టణ ప్రణాళిక అధికారులు సదరు నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి, చట్ట ప్రకారం కూల్చి వేయాలన్నారు.

అరండల్‌పేట, గుంటూరువారితోట ప్రాంతాల్లో అనధికార కట్టడాలను గమనించి పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ ప్లాన్ మంజూరుకు అనేక నిబంధనలను సరళతరం చేసినప్పటికీ ప్లాన్ తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉండే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలో అనధికార, అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే పర్యవేక్షణ చేయాల్సిన సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసి, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శంకర్ విలాస్ వంతెన పనులు దృష్ట్యా ఈ నెల 9 నుంచి ప్రస్తుతం ఉన్న వంతెన కూల్చివేత పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ప్రత్యామ్నాయంగా ఉన్న రోడ్లు, డ్రైన్ల ఆక్రమణ తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆక్రమణల తొలగింపు వాహనాలు రాత్రి సమయాల్లో కూడా వార్డుల వారీగా మెయిన్ రోడ్లపై పర్యటించి, ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాల మంజూరు చేయాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల: మండలానికి చెందిన చిలువూరు గ్రామంలో మాదిగ పల్లెకు ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని

ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. శతాబ్దకాలంగా విద్యాబుద్ధులు నేర్పిన ఆర్సీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల ఈ విద్యాసంవత్సరం మూతపడటంతో వందలాది మంది పేద పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకమైందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు దూర ప్రాంతాల్లో స్కూళ్లలో చేర్పించాలంటే భారం మోస్తున్నారని, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల ఫీజులు చెల్లించలేక నాణ్యమైన విద్యా అవకాశం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1500 పైగా ఓటింగ్, 3000 జనాభా ఉన్న మాదిగ పల్లెలో ప్రభుత్వ పాఠశాల అవసరం అత్యవసరమని గుర్తుచేశారు. విద్యా హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న అధికారులపై ఏపీ హైకోర్టు, బాలల హక్కుల కమీషన్, హ్యూమన్ రైట్స్ కమీషన్, ఎస్సీ కమీషన్‌లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్వే నిర్వహించి మాదిగ పల్లెకు ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యాస ఫౌండేషన్ చైర్మన్ చిలువూరు ప్రసాద్, రామగిరి రాజు, మల్లవరపు డేవిడ్, గోచిపాత ఆదిత్య, పౌలు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఈ నెల 4వ తేదీన ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని చెప్పారు.

పొన్నూరులో రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణం జీబీసీ రోడ్డులోని శ్రీ భావనారాయణ స్వామి ఆలయం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును కూటమి నాయకులు శుక్రవారం అందజేశారు. ఉండవల్లి గ్రామానికి చెందిన నందిపాముల సునీతకు మంజూరైన రూ. 22,655లు విలువైన చెక్కును ఇంటికి వెళ్లి అందజేశారు. చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు సునీత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు దాసరి కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు వంగా నరేంద్ర, ఉండవల్లి గ్రామ జనసేన అధ్యక్షులు రాజా రమేష్, ఉండవల్లి గ్రామ ప్రధాన కార్యదర్శి సంకురు ప్రశాంత్, గాదె బసి రెడ్డి, వల్లభాపురం శంకర్, భార్గవ్, చైతన్య, లామ్ నరేష్, సంకురు శివాజీ, సునీల్, నందా, పులి సతీష్ పాల్గొన్నారు.

రేపటి ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మంగళగిరి : అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ మంగళగిరి పట్టణంలోని ద్వారకా నగర్ నాలుగవ వార్డులో సీపీఐ ఆధ్వ

ర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడం వలన విద్యుత్ వినియోగదారులపై అదనంగా భారం పెరుగుతుందని స్మార్ట్ మీటర్లను బిగించవద్దని ఆయన డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వలన సెల్‌ఫోన్ మాదిరిగానే రీఛార్జ్ చేసుకోవాలని దాని వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడతారని ఆయన అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ ఈ నెల 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఆయన కోరారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో నాలుగో వార్డు శాఖ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, కోదూరు శివాజీ, పేరుపోయిన ముక్కంటి, బాపనపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ చెక్కు అందజేత

విశాలాంధ్ర-మంగళగిరి : ఇస్లాం పేటకు చెందిన షేక్ అబ్దుల్ గఫార్ శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య చికిత్స

కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 35 వేలు మంజూరు కాగా ఆ మంజూరు పత్రాన్ని గఫార్‌కు అందజేశారు. మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ ఇబ్రహీం, 13వ వార్డు అధ్యక్షుడు షేక్ అమీర్, ప్రధాన కార్యదర్శి షేక్ అన్వర్ భాష, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వంగర హనుమాన్, తోట గౌరీ శంకర్, వార్డు కమిటీ సభ్యులు మొగల్ కరీముల్లా బేగ్ పాల్గొన్నారు.

ముగిసిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం

విశాలాంధ్ర-మంగళగిరి : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) 2025-2028 కాలానికి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయింది. ఎన్నికలు ఈ నెల 16న జరగనున్న నేపథ్యంలో

మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంలో ఆదివారం నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుత ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ తరఫున కర్నూల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.గోవింద రెడ్డి అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. కార్యదర్శి పదవికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ పదవికి బండారు నరసింహారావు, ట్రెజరర్ పదవికి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ పదవికి దండు గౌర్ విష్ణు తేజ్ నామినేషన్ వేశారు. జాయింట్ సెక్రటరీ పదవికి ఇద్దరు అభ్యర్థులు బి.విజయ్ కుమార్, బి.శ్రీనివాసరాజు నామినేషన్లు వేశారు. నామినేషన్ ఉపసంహరణకు చివరి తేదీ ఆగస్టు 11, ఎన్నికల ఫలితాలు ఆగస్టు 16న వెలువడనున్నాయి.

స్నేహితుల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్నేహితులు లేనివారు ఉండరని, ప్రతి అడుగులోనూ ప్రోత్సహిస్తూ.. ఆనందంలోనూ.. బాధలోనూ వెంటనడిచే వారే స్నేహితులని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఎస్ఐఎస్ఎస్ కార్యాలయంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా

జరిగాయి. ఈ సందర్భంగా కాళహస్తి మార్కెటింగ్ జేడీ రాజశేఖర్‌తో కలిసి కేక్ కట్ చేశారు. కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ స్నేహం యుగ యుగాలుగా ఉంటుందని, ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. స్నేహ బంధం ఎప్పటికీ విడిపోకుండా కలకాలం ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నవ్వులు, కన్నీళ్లు, ఆనందాలు, బాధలు అన్నింటినీ పంచుకునే వారే స్నేహితులని, స్నేహితులతో గడిపిన ప్రతి క్షణం ఒక జ్ఞాపకం లాంటిదని అన్నారు.

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులపై 'అపుస్మ' హర్షం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్రంలోని వేలాది ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చిరకాలంగా ఎదురుచూస్తున్న సమస్యలపై క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ జీఓ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు విడుదల చేసిన జీఓ ఆర్సీ నెంబర్

30/67/2025 ఏ అండ్ ఎల్డి డేట్ 2025 ఆగస్టు 1 పట్ల ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) రాష్ట్ర అధ్యక్షులు కొలసాని తులసి విష్ణు ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ స్మార్ట్ స్కూల్‌లో ప్రభుత్వ జీఓ కాపీల ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యాలకు అకారణంగా బయట వ్యక్తుల నుంచి, కొంతమంది తల్లి దండ్రుల నుంచి అనేక ఒత్తిళ్లు దౌర్జన్యాలు ఎదుర్కోవటం పరిపాటిగా మారేదన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన జీఓ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల ప్రాంగణాలలో ఎటువంటి రాజకీయ గుర్తులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన వస్తువులు, జెండాలు, శాలువాలు, కరపత్రాలు, ప్రదర్శనలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. అలాగే పాఠశాల ఆవరణలో వాంఛనీయ సమూహాలు వ్యక్తులు వివిధ సంఘాల పేరుతో ప్రవేశించి విద్యార్థినులను, ఉపాధ్యాయులను, పాఠశాలల, కళాశాలల నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేయటం, విధ్వంసాలకు దిగటం, భౌతికదాడులు చేయటం చట్టరీత్యా నేరమని, శిక్షార్హులు అవుతారని తెలియజేశారు. ఈ సమావేశంలో అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.మస్తాన్ రావు, అడిషనల్ ట్రెజరర్ కాటూరి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు నాయుడు చక్రనాగ్, నగర అధ్యక్షులు కన్నా మాస్టర్, జిల్లా కోశాధికారి ఎస్.సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడారి ఓడ పుస్తక పరిచయ సాహిత్య సభ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికపై ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత పలకలూరి శివరావు రచించిన ఎడారి ఓడ వజ్రోత్సవ జ్ఞాపిక పుస్తక పరిచయ సాహిత్య సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి గంటా మనోహర్ రెడ్డి, విశిష్ట అతిథిగా డాక్టర్ రావి రంగారావు, గౌరవ అతిథిగా విమల, డాక్టర్ జెల్ది విద్యాధర్, రచయిత ఏ.శ్రీనివాసరావు, సంఘ సేవకులు బత్తుల మురళి, ప్రముఖ రచయిత్రి తాటి కోకిల పద్మావతి, రచయిత సయ్యద్ జానీ బాషా, తుళ్లూరు సూరిబాబు, బలరాం, పలువురు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు ద్విచక్ర వాహనం వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మండలం శాంతినగర్ నామ్ రోడ్డుపై ఆదివారం బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు దర్శి మండలం చిన్న ఉయ్యాలవాడకు చెందిన గాలం కోటేశ్వరరావు (60) కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 సిబ్బంది అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

మృతదేహాలను పరిశీలించిన జేసీ

విశాలాంధ్ర - అద్దంకి : బల్లికురవలో ఓ గ్రానైట్ క్వారీలో ఆదివారం ప్రమాదవశాత్తు బండరాళ్ళ కిందపడి ఒరిస్సా కు చెందిన ఆరుగురు కూలీలు దందా బాదియా (48) ముస్సా జనా(43) తాకున దలాయ్(37) భ సమల బెహరా (30) సంతోష్ గౌడ్ (36) భాస్కర్ బిషోయి (40) మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇన్చార్జి జేసి గంగాధర్ గౌడ్, బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టం విషయంపై అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ శ్రీ చరణ్ అద్దంకి సీఐ సుబ్బరాజు, బల్లికురవ ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

శ్రీపోలేరమ్మ కొలుపుల్లో ఎమ్మెల్యే మాలకొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలం కీర్తివారిపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పోలేరమ్మ తల్లి కొలుపుల ఉత్సవంలో చీరాల శాసన సభ్యులు మద్దులూరి మాల కొండయ్య పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరినీ అమ్మవారు చల్లగా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. మొక్కులను నాటారు. ఈ కార్యక్రమంలో తెదేపా చీరాల నియోజక వర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : గ్రంథాలయాలు జ్ఞాన సమూర్హా జనకు నిలయాలుగా నెలకొల్పారని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రం సంతమాగులూరు గ్రంథాలయం శాఖలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. లైబ్రరీకి పరిసర ప్రాంతాలు నుంచి 18 మంది బాలబాలికలు హాజరయ్యారు. అందుబాటులో ఉన్న వివిధ రకాల ఆట వస్తువులు, నీతి కథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ ఇతరత్రా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పిల్లలతో పుస్తకాలు చదివించారు. గ్రంథాలయానికి ఎక్కువ మంది బాలబాలికలు వచ్చే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన కోరారు.

బడి భోజనం భలేగా ...

మారిన పాఠశాల మధ్యాహ్న బడి భోజనం

విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మంచి పౌష్టికాహారం అందించేందుకు కూటమి ప్రభుత్వం లోకేష్ విద్యాశాఖామంత్రిగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత మెరుగుపడింది. గతంలో లావు బియ్యంతో వండిన అన్నం తమకు నచ్చని విద్యార్థులు ఇంటి నుంచి బాక్సుల్లో భోజనం తెచ్చుకొని తినేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఖచ్చితమైన తూకంతో పౌరసరఫరాలశాఖ అధికారులు పోర్టిఫైడ్ చేసిన సన్నబియ్యాన్ని 25 కిలోలుగా సంచులలో నేరుగా పాఠశాలలకే సరఫరా చేస్తున్నారు. ఈ బియ్యం బ్యాగులకు క్యూఆర్ కోడ్ తో కూడిన ఒక ట్యాగ్ ఉంటుంది. ఈ బ్యాగ్‌లు తీసుకున్న తరువాత క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి యాప్‌లో ప్రధానోపాధ్యాయులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అంతే కాకుండా ప్రతి రైస్ బ్యాగ్ సీలు తీసిన మొదటి రోజు ఆ బస్తాలోని బియ్యం నాణ్యతను కూడా యాప్‌లో నమోదు చేయాలి. గత ప్రభుత్వం పాఠశాల మధ్యాహ్న భోజనానికి తమ సొంత పేర్లు పెట్టుకుని రాష్ట్ర మొత్తం ఒకే మెనూని అమలు చేసి కనీస నాణ్యతా ప్రమాణాలు లేకపోవటంతో 30 శాతం విద్యార్థులు బడి భోజనం చేసేవారు. ఆ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు చేసింది. ఈ పథకానికి "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం" అని పేరు పెట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని4 జోన్లుగా విభజించి ఆయా ప్రాంత ఆహారపు అలవాట్లకు అనుగుణంగా జోన్‌కి ఒక మెనూని రూపొందించారు. మంచి మెనూతో పాటు నాణ్యమైన చిక్కీలు , బియ్యం అందుతుండటంతో ఈ పథకం అసలు ఉద్దేశం నెరవేరినట్లయింది.

99 శాతం విద్యార్థులు బడిలోనే భోజనం

-రావిశ్రీనివాసరావు సీనియర్ ఉపాధ్యాయుడు

ఇప్పుడు సుమారు 99 శాతం మంది విద్యార్థులు బడిలోనే భోజనం చేస్తున్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం అందజేస్తుండటంతో విద్యార్థులకు విటమిన్లతో పాటు సరయిన పోషకాలు అందుతున్నాయి. గతంలో ఐదు రోజులు ఉడికిన గుడ్డునే ఇచ్చేవారు. మారిన మెనూతో రోజుకు ఒకరకంగా ఉడికిన గుడ్డు, గుడ్డు ఫ్రై , గుడ్డు కూర అందిస్తుండటంతో పిల్లలు భోజనాన్ని ఇష్టంగా తింటున్నారు. ఈ పథకం ఇంకా మెరుగ్గా ఉండటానికి ఈ మార్పులతో పాటుగా వంటవారికి ప్రతి నెలా 5 వ తేదీ లోపు బిల్లులు గౌరవ వేతనం చెల్లించాలి.. అదేవిధంగా వంటవారికి ఇప్పుడు ఇచ్చే 3 వేలు గౌరవ వేతనాన్ని 4 వేలు చేయాలన్నారు.

వైసీపీ నాయకులపై

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

వరికూటిని పరామర్శించిన మాజీ మంత్రి అంబటి

విశాలాంధ్ర - రేపల్లె : రైతుల సమస్యలపై పోరాడుతున్న వైఎస్ఆర్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేమూరు అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు గతమూడు రోజులుగా రేపల్లె ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో దీక్ష చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్ఆర్సీపీ నాయకులు మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆదివారం మధ్యాహ్నం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో దీక్ష చేస్తున్న అశోక్ బాబును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు దీక్ష చేపడతానని అశోక్ బాబు చెప్పినట్లు మీడియా సమావేశంలో అంబటి రాంబాబు తెలిపారు.రైతుల పక్షాన పోరాడే నాయకుల పై అక్రమ కేసులు బనాయించడం, వైసీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలు కూటమి ప్రభుత్వం చేపట్టడం పట్ల రాంబాబు తీవ్రంగా ఖండించారు. రైతుల అభ్యున్నతికి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని చెబుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రస్తుతం భట్టిప్రోలు నుండి కనగాల వరకు మురుగు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగించాలని సుమారు నాలుగువేల ఎకరాలు ఆయకట్టు ముంపుకు గురికాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని అశోక్ బాబు ధర్నా చేస్తే అతనిపై తప్పుడు కేసులు బనాయించడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. గత సంవత్సర కాలంగా వేమూరు నియోజవర్గంలో ప్రజల సమస్యలపై ముఖ్యంగా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు ఆందోళనలు చేపడుతున్న నాయకుడు అశోక్ బాబు అని అంబటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. రైతులకు న్యాయం జరిగే వరకూ దీక్ష విరమించనని అశోక్ బాబు విలేకర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ పట్టణ అధ్యక్షులు కరేటి శేషగిరిరావు, నాయకులు చిత్రాల పోలేదు, సముద్రాల ప్రభు కిరణ్, కర్ర రత్నాకర్, దాసరి ప్రసాద్, చిమటా బాలాజీ, కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, పట్టెం శ్రీనివాసరావు, యన్నం సురేష్, జంగం వాసు,కపుతరపు పద్మావతి, సజ్జా పద్మావతి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల యోగాభ్యాసం

విశాలాంధ్ర-దాచేపల్లి : స్నేహితుల దినోత్సవంలో భాగంగా ఆదివారం నారాయణపురంలోని యోగ విజ్ఞాన కేంద్రంలో పదో తరగతి లోపు విద్యార్థులు యోగ చేశారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ యోగ చేసే విధానం, దాని వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమాలను బొడ్డు నాగేశ్వరరావు, యర్రంశెట్టి గోపీనాథ్ తదితరులు పర్యవేక్షించారు.

కొండపి పంచాయతీ సర్పంచ్ పదవి మాదిగలకే

విశాలాంధ్ర-కొండపి : దశాబ్ద కాలం తర్వాత కొండపి పంచాయతీకి ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో నామినేషన్ల పర్వం సైతం ముగిసింది. స్థానిక టిడిపి , వైయస్సార్సీపి నాయకత్వం సైతం పంచాయితీ ఎన్నిక రాజీ మార్గంలో వెళ్లడానికి రెండు రోజుల క్రితం ఒప్పందం చేసుకున్నారు. కొండపి పంచాయితీలో 6,600 మందికి పైగా ఓటర్లు ఉన్నారు. పంచాయితీ ఎస్సీకి రిజర్వ్ అయింది. సర్పంచి పదవి ఎస్సీకి రిజర్వుడు కావటంతో పదవిని ఎస్సి లోని మాల ,మాదిగ కులాలు ఆశిస్తున్నాయి. గతంలో కొండపి పంచాయతీ సర్పంచి రిజర్వేషన్ అయినప్పుడు టిడిపి ప్రభుత్వంలో కొండపి పంచాయతీ సర్పంచ్ పదవిని ఎస్సీల్లోని మాల కులానికి కేటాయించారు. అప్పుడు సర్పంచి అభ్యర్థిగా కొండపి చెందిన యనమద్దిని మల్లికార్జున రావు పోటీ చేసి గెలుపొంది సర్పంచిగా ఐదు సంవత్సరాల పాలన చేశారు. ఈసారి కచ్చితంగా మాదిగ కులానికి చెందిన వ్యక్తులకే సర్పంచి పదవి ఇవ్వాలని టిడిపి అధిష్ఠానం వద్ద మాదిగలు తెలిపారు. కాగా కొండపి పంచాయతీలో మూడు పల్లెలు మాల కులానికి చెంది ఎక్కువమంది జనాభా ఉన్నారని తమకే మళ్లీ అవకాశం ఇవ్వాలని ఎస్సి మాలలు టిడిపి అధిష్ఠానా నికి తెల్పి చెప్పినట్లు తెలుస్తుంది. అయితే టిడిపి అధిష్ఠానం మాత్రం ఈసారి మాదిగ కులానికి సర్పంచ్ పదవి ఇవ్వాలని ఆ మేరకు స్థానిక నాయకత్వానికి సైతం అవగాహన కల్పించినట్లు పంచాయతీ ప్రజలు చెప్పుకుంటున్నారు. మాదిగ కులానికి సర్పంచ్ అభ్యర్థిగా ఇస్తే కొమ్ము రవి కుటుంబానికి చెందిన వ్యక్తి సర్పంచ్ అభ్యర్థిగా, అదేవిధంగా ఉప సర్పంచ్ అభ్యర్థిగా కొండపికి చెందిన టిడిపి నాయకుడు బుదవాటి సోమయ్య అల్లుడు నేతి రవికుమార్‌కి అవకాశం ఇస్తారని జోరుగా కొండపి పంచాయతీలో ప్రచారం జరుగుతుంది.